క్లుప్తంగా

వైభవంగా పడిపూజ



పడి పూజలో వెలుగుతున్న దీపాలు

నగరి: పట్టణ పరిధి బైపాస్ మలుపు వద్ద గల ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో ఆదివారం పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు. అయ్యప్ప, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి చిత్రపటాలకు, పద్దెనిమిది మెట్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. అయ్యప్ప భజనల అనంతరం మెట్లపై దీపాలు వెలిగించి పడిపూజ చేశారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

నగరి: పట్టణ పరిధి ఏజేఎస్ కల్యాణ మండపంలో శ్రీకృష్ణయాదవ సేవా కమిటీ వారు నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. అన్నాగౌరీ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో ఉచితంగా 225 మందికి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని యాదవ సంఘ నేతలు రామలింగం, జయరామ్, నరేష్, వరదరాజులు, దొరస్వామి, వెంకటేష్, ధన, ఎంఎం.వెంకటేశులు, రామాంజులు, గోపాల్ పర్యవేక్షించారు.

బెంగళూరుకు బస్సులేవీ..?



బెంగళూరు బస్సు ఎక్కేందుకు కుస్తీ పడుతున్న ప్రయాణికులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బెంగళూరుకు బస్సు లేక ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. గమ్యం చేరుకోవడానికి కుస్తీలు పడుతున్నారు. చిత్తూరు నుంచి బెంగళూరు వెళ్లడానికి ఆదివారం బస్సు లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఆర్టీసీ బస్టాండులో వందలాదిమంది గంటల తరబడి నిరీక్షించారు. బెంగళూరు వెళ్లడానికి పడిగాపులు కాశారు. వచ్చిన ఆ బస్సులన్నీ కూడా తిరుపతి నుంచి కిటకిటలాడడంతో బెంగళూరు చేరుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రత్యేక బస్సులు కల్పించడంతో ఆర్టీసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ప్రతి ఆది, సోమవారాల్లో ఈ సమస్య ఎదురవుతున్న అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ సంఖ్య పెరుగుతున్న ఆర్టీసీ అధికారులు ఏమాత్రం కదలడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాలు దిక్కుగా మారుతున్నాయని, ఇదే అదునుగా డబుల్ చార్జీలు గుంజేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.

మాకూ ఉపాధి చూపండి!

- వ్యవసాయరంగాన్ని వేధిస్తున్న కూలీల సమస్య
- ఏటా పెరుగుతున్న పెట్టుబడులు
- ఉపాధితో అనుసంధానం కోసం రైతుల ఎదురుచూపు



నాగరాజకుప్పంలో దుక్కి దున్నుతున్న రైతు, పనిచేస్తున్న కూలీలు

నగరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో కూలీల కొరత ఏర్పడిందని, అందువల్ల ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే కూలీల కొరత తీరుతుందని పేర్కొంటున్నారు. గతంలో అనుసంధానం చేస్తామని బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు హామీనిచ్చి గాలికి వదిలేసింది. అయితే ఈ సారైనా అమలు చేసి తమకు తోడ్పాటు అందిస్తారన్న ఆశలతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులు

వ్యవసాయ రంగంలో పెట్టుబడి ఖర్చులు రోజురోజుకూ పెరుగుతుండడంతో రైతుల కష్టానికి తగిన ఫలితం రావడం లేదు. ప్రతి ఏడాది ఎరువుల ధరలు కూడా పెరుగుతున్నాయి. ఖరీఫ్ సీజన్లో వరి పంటకు ఎకరానికి రూ.25 వేల ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. మొక్కజొన్న, వేరుశనగ ఇతర పంటలకు కూడా భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత మొత్తంలో పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేసినా, పంట చేతికి వచ్చేంత వరకు నమ్మకం ఉండదని వాపోతున్నారు. దీనికి తోడు కూలీల పనులకు రోజుకు రూ.400, మందులు చల్లడానికి రూ.500 నుంచి రూ.600 ఇచ్చుకుంటూ ఒక పూట భోజనం కూడా పెట్టాల్సి వస్తోందని అంటున్నారు. ఈ క్రమంలో ఉపాధి పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం చేస్తే రైతులకు అయ్యే కూలీ ఖర్చులు తగ్గడంతోపాటు రైతులు, కూలీలకు ఇచ్చే డబ్బులో కొంత ఉపాధి కూలీలకు ఇస్తే వారికి కూడా లాభం చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. కూలీల సమస్యతో వ్యవసాయం ఆపేసిన పలువురు మళ్లీ వ్యవసాయం చేసేందుకు ముందుకొస్తారని తెలుపుతున్నారు. రైతులకు మేలు చేసే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూలీల సమస్య వెంటాడుతోంది



వ్యవసాయ రంగంలో రోజురోజుకూ కూలీల సమస్య వేధిస్తోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయాన్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచిస్తే బాగుంటుంది. దీంతో ఖర్చులు తగ్గుతాయి. ప్రభుత్వాలు ఆలోచించాలి.

–రమేష్, రైతు, నింద్ర మండలం

ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి



వ్యవసాయ రంగాన్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి. కూలీల సమస్యతో రైతులు వ్యవసాయాన్ని విడిచిపెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. ఉపాధి పనుల పేరుతో రూ.కోట్లతో ప్రభుత్వాలు పనులు చేపడుతున్నాయి. ఇవే పనులను వ్యవసాయ రంగంతో అనుసంధానం చేస్తే రైతు బాగుపడతాడు.

–గురుమూర్తి, రైతు, టీవీ కండ్రిగ, నగరి మండలం

వ్యవసాయ పనులు కూడా జరుగుతున్నాయి



రైతుకు అవసరమయ్యే సాగునీటి పనులు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, నీటి గుంతల ఏర్పాటు పనులు ప్రస్తుతం ఉపాధి పథకం ద్వారా చేస్తున్నారు. వ్యవసాయ కూలీ పనులు ఉపాధి పథకంతో అనుసంధానం ప్రక్రియపై ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది.

–రాఘవేంద్రయాదవ్, వ్యవసాయ అధికారి, నగరి మండలం

17,18 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక

నింద్ర: మండల కేంద్రంలో ఈనెల 17,18 తేదీల్లో క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు వసుమతి, శ్రీధర్‌రాజు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధర్యంలో అండర్ 14, 17 బాల బాలికల ఎంపిక స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో ఉంటుందని తెలిపారు. అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన వచ్చునని చెప్పారు.

చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న సత్యప్రసాద్

కార్వేటినగరం: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యప్రసాద్ సతీమణి కోమల, కుమారుడు సుధీర్‌కుమార్ కలిసి రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానంతో పాటు, చీరలు, పంచెలు వితరణ చేశారు. ఈసందర్భంగా సబ్‌రిజిస్ట్రార్ సత్యప్రసాద్ మాట్లాడుతూ తమ వంశంలో మృతిచెందిన వారి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది వృద్ధులకు, అనాథలకు దుస్తులు వితరణ చేయడం ఆనవాయితీ అన్నారు. రాస్ కో–ఆర్డినేటర్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా నారాయణస్వామి పెళ్లిరోజు



పెళ్లిరోజు వేడుకలు జరుపుకుంటున్న నారాయణస్వామి దంపతులు

కార్వేటినగరం: మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జెడ్పీటీసీ పరంజ్యోతి పెళ్లి రోజు వేడుకలను ఆదివారం పుత్తూరులోని తన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్వేటినగరం ఎంపీపీ లత, బాలాజి దంపతులు, పురంధర్ శాలువలు కప్పి సన్మానించారు. అలాగే పెనుమూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, సాతం బాకం ఎంపీటీసీ, జీడీనెల్లూరు నియోజకవర్గం మాజీ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు దూదిమోహన్ శాలువలు కప్పి, పూలమాలలతో సన్మానించారు.

బ్రహ్మశ్రీ ఆశ్రమంలో లోక్‌సభ స్పీకర్

రామచంద్రాపురం: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆదివారం సాయంత్రం మండలంలోని సి.రామాపురం సమీపంలోని శ్రీ బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమంలోని లక్ష్మీనారాయణ మందిరం, జైన్ మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మర్షి గురూజీ ఆశీస్సులు పొందారు. తొలుత ఆశ్రమ నిర్వాహకులు మేళతాళాలతో ఆయనకు స్వాగతం పలికారు. పూజల అనంతరం శేషవస్త్రంతో సత్కరించారు. లక్ష్మీనరసింహస్వామి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు



నూతన వధూవరులతో ఆర్కే రోజా

నగరి: చెన్నై తచ్చూర్‌లో జరిగిన నగరి మున్సిపాలిటీ ఇందిరానగర్ వైఎస్సార్‌సీపీ యువ నేత మహ్మద్ సాహి వివాహానికి ఆదివారం మాజీ మంత్రి ఆర్కేరోజా హాజరయ్యారు. నూతన వధూవరులు మహ్మద్ సాహి, ఫరీదాలకు ఆమె ఆశీస్సులు అందజేశారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?



సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య

నగరి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఎప్పుడిస్తారు, పరిశ్రమలను ఎప్పుడు స్థాపిస్తారు అంటూ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలంటూ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో పార్టీ యువజన సంఘం నాయకులు నేతాజీ, మహేంద్రనాథ్ అధ్యక్షతన నిర్వహించిన యువజన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా నిరుద్యోగులకు ప్రతినెలా నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని పేర్కొందని, పలు పరిశ్రమలు తెచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ హామీ ఇచ్చిందన్నారు. అయితే పాలన 15 నెలలు దాటినా ఇప్పటి వరకు ప్రభుత్వం వీటి ఊసే ఎత్తలేదన్నారు. ఇకనైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. హామీలు నెరవేర్చేవరకు యువతతో కలిసి పోరాటం కొనసాగిస్తామన్నారు. ఏఐటీయూసీ సీనియర్ నేత వేలన్, బాషా, ఏసయ్య, యువజన సంఘం నాయకులు ముత్తు, నరేష్, వేణుగోపాల్, సురేష్, కుమరేసన్ పాల్గొన్నారు.

కమనీయం.. నృత్యం

కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో ఆదివారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. హరికథా కాలక్షేపం, కూచిపూడి, భరతనాట్యం, గీతాలాపనలు, పౌరాణిక నాటిక ప్రదర్శనలు ఆహూతులను కట్టిపడేశాయి. అద్భుత ప్రదర్శనల ఇచ్చిన కళాకారులకు భక్తులు చప్పట్లతో అభినందించారు. అనంతరం అధికారులు బహుమతులు ప్రదానం చేశారు.

నేడు రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మునిరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్ప దోష నివారణ పూజలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి



నరసింహులునాయుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నారాయణస్వామి, విజయానందరెడ్డి



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

శ్రీరంగరాజపురం: మండలంలోని 50 బసివిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బి.నరసింహులునాయుడు ఇటీవల మృతిచెందారు. ఆదివారం ఆయన స్వగ్రామంలో జరిగిన కర్మక్రియలకు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెళ్లి నరసింహులునాయుడు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు ఆగవు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాగరాజు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజాసమస్యలపై పోరాటాలు ఆగవని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. ఇటీవల రెండోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన నాగరాజును ఆదివారం స్థానిక పీహెచ్‌వాడలో ప్రాంతవాసులు సన్మానించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా స్థానికులు మాట్లాడారు. గత 35 ఏళ్లుగా ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తున్నారని కొనియాడారు. కార్మికుల సమస్యల పట్ల ఎన్నో పోరాటాలు చేశారన్నారు. పేదల సమస్యల పట్ల ఉద్యమస్ఫూర్తితో పనిచేయాలని వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజా, స్థానికులు, నాయకులు విజయచక్రవర్తి, సుధాకర్, అన్నామలై, ఎస్టేట్ నాయకులు జీ.డి.నాయుడు, శ్రీనివాసులు యశ్వంత్, తీర్థ పాల్గొన్నారు.

కాటేస్తాయి జాగ్రత్త!

- వర్షాలతో అన్నిచోట్లా పచ్చదనం
- విచ్చలవిడిగా విషసర్పాలు
- అన్నదాతలు జాగ్రత్తలు తీసుకోవాలి



విషపురుగులకు నిలయంగా ఉండే పిచ్చిమొక్కలు, పచ్చని కసువు

కార్వేటినగరం: వర్షాలు పడుతుండడంతో అన్ని ప్రాంతాలూ పచ్చదనంతో పరుచుకున్నాయి. బీడు భూములు, అటవీ ప్రాంతాల్లో మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనం పరిచినట్లు కనిపిస్తోంది. దీంతో పాములు, విషపురుగులు విచ్చలవిడిగా సంచరిస్తుంటాయి. ఈ సమయంలోనే కుంటలు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, గడ్డివాములు, పేర్చిన కట్టెలు, ఇటుకలు వంటి చోట్ల విషపురుగులు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, అటవీ పాత్రానికి దగ్గరగా ఉండేవారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా విషపురుగులు, పాము కాటుకు గురయ్యే అవకాశం లేకపోలేదు.

ఆహారం కోసం బయటకు

వర్షాకాలం కావడంతో కప్పలు ఎక్కువగా బయటకు వస్తుంటాయి. వాటితో పాటు బల్లులు, ఎలుకలు, తొండలను పాములు వేటాడుతుంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాముకాటుకు గురై ప్రాణం మీదికి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. జిల్లాలో ఎక్కువగా విషసర్పాలు ఉన్నాయి. ఎవరైనా పాముకాటుకు గురైతే సరైన సమయానికి వైద్యం అందకుంటే ఒక్కసారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

పాముకాటు ఇలా

పాములకు చెవులు లేనప్పటికీ వాటి శరీరం కింద భాగంలో ఉండే ప్రత్యేక పొలుసుల ద్వారా శబ్ద ప్రకంపనలను గ్రహిస్తాయి. వేడి రక్తం ప్రవహించే జంతువులు, మనుషులు సమీపంలోకి వచ్చినప్పుడు అవి వెంటనే వాటిని గుర్తించి కాటువేస్తాయి. పాముల ఏకాంతానికి భంగం కలిగించినప్పుడు లేక ప్రాణభయం ఉన్నప్పుడు, ఎవరైనా వాటిని తొక్కినప్పుడు మాత్రమే అవి కాటు వేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో తిరిగే వారితో పాటు, పొలాలు దగ్గర నిద్రించే రైతులు, కూలీలు మాత్రం తమ వెంట టార్చ్‌లైట్ ఉంచుకోవాలి. ఉన్న ప్రదేశాలను రోజూ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పాములు కిరోసిన్, పెట్రోల్, డీజిల్ వంటి వాసన భరించలేవు. ఎక్కువగా ఉన్నచోట వీటిని ఉపయోగిస్తే మరీ మంచిది. రైతులు, కూలీలు రాత్రి వేళల్లో తిరిగేటప్పుడు కూడా మోకాళ్ల వరకు లెదర్ షూ వేసుకోవడం శ్రేయస్కరం. గడ్డిపని చేసే వారు రబ్బరు తొడుగులు వేసుకోవాలి. ఇళ్ల చుట్టుపక్కల పొదలు లేకుండా చూసుకోవాలి.

ప్రథమ చికిత్స ఇలా చేసుకోవాలి

- పాముకాటు వేసిన పైభాగంలో వెంటనే రక్తప్రసరణ జరక్కుండా తాడుతో కట్టాలి
- పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా ఉండాలి.
- కాటువేసిన పాము అంతకుముందు ఆహారం తిన్నా, మరో జీవికి కాటువేసినా విషం తీవ్రత తక్కువగా ఉండేందుకు అవకాశం ఉంటుంది.
- పాముకాటు వేసిన వ్యక్తికి ఎట్టి పరిస్థితిల్లోనూ ఆహారం ఇవ్వకూడదు, నడిపించడం, పరిగెత్తించడం చేయకూడదు.
- నాటు మందులతో కాలాయాపన చేయకుండా వెంటనే దగ్గరలో ఉన్న వైద్యశాలకు తరలించాలి.
- పాముకాటుకు గురైన వ్యక్తిని నిద్రపోకుండా జాగ్రత్తగా చూసుకోవాలి.
- ఇలా చేయడం వల్ల ప్రమాదం నుంచి బయటపడేందుకు అవకాశం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు.

భయపడాల్సిన అవసరం లేదు..



పాముకాటుకు గురైన వ్యక్తి భయపడాల్సిన అవసరం లేదు. ఆలస్యం చేయకుండా దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి. పాముకాటుకు గురైన వ్యక్తి ధైర్యం కోల్పోకుండా చూసుకోవాలి. విషపూరిత పాముకాటు వేసినట్లు నిర్ధారించుకున్న తరువాతనే విరుగుడు మందు ఇస్తారు. ప్రస్తుతం పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ హేమశ్రీ, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, కత్తెరపల్లి